# రాభణుడు

కాళిదాసో, తెనాలి రామకృష్ణుడో గుర్తు లేదు కానీ, ఒకసారి పద్యం చెబుతూ దాల్లో లెగ్గేశాడుట.

తన పద్యంలో రావణాసురుడు బదులు రాభణాసురుడు అన్నాడుట. అప్పుడు భోజురాజో కృష్ణదేవరాయలో మహాశ్చర్యపోయి 'ఇదేమిటి మహాప్రభో' అనుకున్నాడుట.

అప్పుడు మంత్రిగారో, మరో పెద్ద మనిషో, 'అదేమిటి మీరే మహా ప్రభువులు. వీళ్ళు మహాకవులు మాత్రమే. ఈ కవిగారి ఉదేశ్యం ఏమిటంటే ఆ యొక్క రావణాసురుడుగారికి ఇద్దరు తమ్ముళ్ళు. పార్టీలు మారిన విభీషణుడు మరియూ ఆఫీసులో కూడా నిద్రపోయే కుంభకర్ణుడు. మరి తమ్ముళ్ళకే ఒత్తు భ వున్నప్పుడు అన్నకి లేకపోవటమేమిటని కవిగారు ఆ ఒత్తుని ధారాళంగా వాడారు' అని సర్దాడుట.

కొన్నాళ్ళ క్రితం మావూళ్ళో నేను అష్టావధానం నిర్వహించాను. అప్పటి పృచ్ఛకుల్లో ఒకాయన ఏదో అడుగుతూ, 'ఈనాడు ఎవరూ తెలుగు సరిగ్గా మాట్లాడటంలేదు. నాకు చాల భాధగా వుంది' అన్నాడు.

దానికి అవధానిగారు నవ్వి, 'అవును. మీ బాధ నాకు అర్థమైంది. రెండు ఒత్తులు పెట్టారు కదా. రెండు రెట్లు భాధ పడుతున్నట్టున్నారు' అన్నారు.

0 0 0

ఇంతకు ముందు తెలుగు భాష గురించీ, అసలు ఏ భాషలోనైనా అక్షరాలు ఎలా రూపాంతరం చెందుతాయనీ వ్రాసుకున్నాం. ఈసారి విషయం వేరు. ఈమధ్య ఇండియా వెళ్ళినప్పుడు కొత్త తెలుగు విన్నాను. మన తెలుగు సినిమాలనించీ దిగుమతి అయిందేమో నాకు తెలీదు కానీ, అది వింటుంటే నాకు పైన చెప్పిన రెండు ఉదాహరణలూ గుర్తొచ్చాయి.

'హలో అంకుల్. అమెరికానించీ ఎప్పుడొచ్చారు. పెల్లి కోసమంటగదా' అన్నాడు మావాడొకడు. పెళ్ళి బదులు పెల్లి అనంగానే నిజంగానే కడుపులో మంట వచ్చింది. అంతే కాదు చ కాస్తా చ్య అయిపోయింది. (అదీకాక నేను పెళ్ళి కోసం రాలేదు. పెళ్ళీడుకొచ్చిన పిల్లలున్నారు నాకు. నాకు పెళ్ళేమిటి. పెళ్ళి చూట్టానికి వచ్చాను)

ఈ మధ్య తెలుగు సినిమాల్లో తెలుగురాని వాళ్ళు పాడే పాటల్లోనూ, తెలుగు వచ్చుననుకునే వారి మాటల్లోనూ చ్యలు ఎక్కువయాయి. వచ్యాను చ్యచ్యాను అని ఒకాయన అంటే, ప్రేమ పిచ్యి అని పాడాడు ఇంకో పరభాషా పిచ్యాయన.

పోయినసారి ఇండియా వెళ్ళినప్పుడు ఒక సినిమా పాటల టేపు కొనుక్కొచ్చాను. నిజంగా చెబుతున్నాను, ఆ టేపులో ఒక పాటని నేనూ మా ఆవిడా వరుసగా కనీసం పాతికసార్లు విన్నాం. ఆ పాటేదో బాగుందని కాదు. ఆ పాటలో మాటలు అర్థం చేసుకుందామని. 'ప్రియా ప్రియా చ్యపోతే... ప్రియా ప్రియా ఝుయిళ్‌త్‌ణా... ' అని పాడతాడు తెలుగులో.

ఎంత సహృదయంతో ప్రయత్నించినా, ఆనాటి నించీ ఈనాటి దాకా, ఆ ప్రియా ప్రియా తప్ప ఇంకొక్క మాట కూడా బోధ పడలేదు. కాకపోతే కాళిదాసు కవిత్వం కొంతా, నా పైత్యం కొంతా అని, యధాశక్తి నాకు తట్టిన అర్థం నేను చెబితే, తనకి తోచిన తాత్పర్యం మా ఆవిడ చెప్పింది. ఇన్నాళ్ళకి ఆ పాట మాకు అర్థమైనట్టుగా వుంది అనుకుంటున్నాం.

మా చిన్నప్పుడు పౌరాణిక సినిమాల్లో కృష్ణుడు విశ్వరూపం చూపించినప్పుడు, వెనకాల ఘంటసాలవారు చక్కగా శ్లోకాలు చదివేవారు. హీరో వేసినాయనకి జ్ఞ పలకదు మరి. ఒక సినిమాలో దర్శకుడు ఆ సందర్భంలో ఆయన చేత మాట్లాడించేంత ధైర్యం చేశాడు. ఆయన కూడా ధైర్యంగా 'అగ్నానంలో వున్న మిమ్మల్ని విగ్నానుల్ని చేయటానికి వచ్చాను' అని తెలుగాభిమానుల్ని భయపెడుతూ తెలుగులో చెప్పాడు.

'సత్యం వధ, ధర్మం చెర' అని పెద్దగా అన్నాడో పెద్ద మనిషి, సత్యాన్ని వధించేసి, ధర్మాన్ని జైల్లో పెట్టేశాడు.

ఎక్కడనించీ వచ్చిందీ ఈ ఉచ్చారణ? ఉచ్చారణ అంటే గుర్తు కొచ్చింది. ఒక పెద్ద మనిషి ఈ మధ్య నాతో, 'ఉచ్చారణ అనే మాటకి మీ ఉచ్చారణ తప్పు. ఉచ్ఛారణ అనాలి' అని వాదించాడు. కాదు నాయనా ఒత్తు లేదు, ఉచ్చారణ అనాలి అని చెబితే నన్నో ఒత్తులు వాడని వట్టి మనిషిగా చూశాడు. ఏం చేస్తాను 'భాధ' పడ్డాను.

ముళ్ళపూడివారనుకుంటాను ఒకసారి వ్రాశారు, 'సశేషం' అనే మాటని బెంగాలీవాళ్ళు కంగాళీగా షొషేష్ అంటారని. తర్వాత ఆలోచిస్తే నాకూ అనిపించింది, ఆదేమాటని ఎంతగా ఖూనీ చేస్తారో మనవాళ్ళు అని. శ అనే బీజాక్షరాన్ని ష అని పలకటం ఉత్తర భారతదేశంలో మామూలుష, షాంతి, ష్యాం అని. అక్కడి ప్రభావంతో అలాంటి కొంతమంది సషేషం అంటారు. కొండొకచో

కొన్ని చోట్ల 'స' ని కూడా ష అని పలుకుతారుష. మరి అలాంటి ఇంకా కొందరు షషేషం అంటారు. అనవసరంగా అడ్డమైనమాటల్లోనూ షాలు ఖర్చుపెట్టటం ఇష్టం లేని పీనాసివాళ్ళు (మరి వాళ్ళు పాదుషాలు కాదు కదా!) సరళంగా 'ససేసం' అనటం కూడా కద్దు.

ఒకాయన నా కథల గురించి వ్రాస్తూ, మీ కధ అని వ్రాశాడు. కధ కాదు నాయనా కథ అని వ్రాయాలి అన్నాను తెలుగు మాష్టారిలా. అవును నేను రాసింది కధ అనే కద అన్నాడు. కధ కాదు కథ. ధ కడుపులో బొట్టు పెట్టు నాయనా అని చెప్పాల్సి వచ్చింది.

మన తెలుగు సినిమా హీరో ఒకతను ఆరడుగులు పొడుగుంటాడు కానీ, పేరాగ్రాఫు మొత్తం మీద అరడజను ఒత్తులు కూడా పలకడు. 'నువ్ అడిగేదేంటో నా కరదం కావటం లేదు. మల్లీ అడుగు' అని. (ఒక ఒత్తుందోచ్!)

అసలు స్పెల్లింగులు రాని ఒక కుర్రాడిని అడిగాడుట ఒకాయన. 'ఒరే! కాఫీ అనే మాటకి స్పెల్లింగ్ చెప్పు. కనీసం ఒక్క అక్షరం ముక్క సరిగ్గా చెప్పినా నీకు నా జోహార్లు' అన్నాట్ట.

వాడో క్షణం ఆలోచించి, 'KAAPHY' అని చెప్పాడుట.

మధుర గాయకుడు బాలుగారి కార్యక్రమం 'పాడుతా తీయగా' చూశాను కొన్నాళ్ళ క్రితం.

ఒక్క అక్షరం సరిగ్గా ఉచ్చరించకపోయినా ఆయన భరించలేడు. సరిగ్గా పలికేదాకా చితక్కొడతాడాయన. మళ్ళీ మనందరిలో ఆ క్రమశిక్షణ వచ్చే దాకా తెలుగు భాషాప్రియులకి ఈ అక్రమ శిక్ష తప్పదేమో!

0 0 0

ఆ మధ్య ఒకరోజు మన తెలుగులో ఈ ఒత్తులు పలకటం ఎందుకు మానేశారు, నోరు తిరగకనా? ఇంకా ఏదైనా కారణం వుందా అని ఆలోచిస్తుంటే, సమాధానం దొరకకపోగా బుర్ర వేడెక్కింది. వీళ్ళు ఒత్తులు వాడాలంటే ఏం చేయాలి అని ఆలోచిస్తూ కూర్చున్నాను.

అప్పుడే ఫోన్‌లో మాట్లాడటం పూర్తిచేసి వచ్చింది మా ఆవిడ.

'ఫోను. అనసూయమ్మగారు. రేపు శనివారం లక్ష వత్తుల నోము చేసుకుంటున్నదిట. రమ్మని పిలిస్తున్నది' అన్నది.

ఎందుకోగానీ నా ముఖం ఒక్కసారిగా వెలిగింది.

'లక్ష ఒత్తులా?' అన్నాను నా ఆలోచనల్లోనించీ తేరుకుంటూ.

పెద్దగా నవ్వింది శ్రీమతి. 'ఒత్తులు కాదు. వత్తులు. లక్ష వత్తుల నోము. నీకెప్పుడూ ఒత్తుల గొడవే!' అంది.

అప్పుడే నా ఆలోచనలు కొనసాగిస్తూ అనుకున్నాను. లక్ష ఒత్తులయితే బాగుండేదేమో, ఈ ఒత్తులు రాని వాళ్ళ కందరికీ తలకి ఇన్ని అని పంచిపెడితే, మన తెలుగు బాగుపడుతుందేమోనని.

0 0 0